# కొండాయి పక్షి

గొడ్డూ గోదా, గెడ్డీ నీలూ, పిడకా, బొడకా అంటా సెంబూ, గుడ్డా గోస్సీ యిట్టాటి కాసింత కూసిని పను సురుగ్గా ఎల్లిపోను, పన్నెండేళ్ల కొండాయిని సవగ్గా జీతానికి పెట్టుకుండాడు కనకయగారు.

"అక్కడున్నావ్రటా కొండాయి పక్షి?" అని మామూలు పెకారం లోన పొయికాడుండ కనకయగారి పెల్లాం మాలచ్చుమ్మగారు కేకేసింది.

ఆడీడ యాడుండా వుంటాడు గనక యిట్టాంటి కేకలు అప్పుడప్పుడు కాత్తె పెడగా పోతావుంటయి కొండాయికి.

అయితే లోన పొయికాడ పొగలో ఎప్పుడు కాత్తె కొరబోతా వుండా కొండాయి సాయిట్టోవుండ బోసానంలో కూకుండాడేవో అనిపిత్తా వుంటది మాలచ్చుమ్మగారికి.

"ఎక్కన్రడా నవు కొండాయి పక్షి—ఇదేమిటి పలకడేం—" వెంటనే అనుమానం దగిలిన మద్చయి, గబిక్కన బోసానం కాడికొచ్చి—నిల్చడిపోయింది మాలచ్చుమ్మగారు, శాస ఎగబీలుత్తా.

"అయ్యో అయ్యో కొంపమునిగింది! మూల నక్కుతావేం, రా బయిటికి? వీడి మొహంమండా. నాకు తెలుసు ఎప్పుడో యీపక్షి కొంపగుండాన పెత్తాడని! దొంగ పక్షి రావేం బయిటికీ?"

"యిహిం యిహిం వూరకనే కూకండానండీ—" అంటా కాత్తె బోసానం యివకాడికొచ్చి నిలబడ్డాడు కొండాయి.

"వూరికే కూచున్నా! మొహాన నిప్పుపెత్తా దొంగపక్షి దొంగపక్షని! యింకా వెనక దాచుకుంటున్నా, బయిటికి తీయవేం ఆ చేతుల్లోదీ?"

"బొమ్మలుంటే - సూత్తా ఆడ మూలకూకుంటేనీ—"

"భోషాణ మూల నక్కుతూ బొమ్మలేవిట్రా, చూపు మండిపోనూ? తీయవేం చేతుల్లోదీ?"

"పుత్తకవండీ."

"పుస్తకం! పుస్తకమేమిటీ! భోషాణందగ్గిర నీకు పుస్తకాలెక్కడివిరా దొంగచచ్చినోడా? నిజం చెప్పు చీలుస్తా."

"ఏనిగలూ, పచ్చులూ వుంటేనీ—?"

"అయ్యో వీడి సూద్రమొహం మండా! రాధాయి పుస్తకం మంట పెత్తు

న్నాడు నే నేంజేతునూ—పెట్టవేం అక్కడా? మీ మొహాలకు చదువా చట్టుబండలా."

"ఏందండోయ్. నే అచ్చిరాలు సెప్పిచ్చుకోలా?"

"ఛీ నోరుముయ్ భోషాణందగ్గిర తాకట్లాడ్తూ. యింకా నయం కాస్త తాళమన్నా దాని మొహాన పెట్టారు. బహు వున్నయి యిట్టాంటి తెలివులు మటుకు, వుల్లిత్తుకుమల్లే బయట బడాయిలు కొట్టకపోతే కాస్త యింటో ఏవన్నా మంట పెట్టకూడదూ? అస లెందుకులే — మొహం మండా అట్లాచూస్తావేం చూపూ? చేతులు విరుస్తా, రాధాయి పుస్తకాలజోలికి పోయినావంటే ఇక్కడికి చాలక ఈ సూద్రసన్నాసి ముద్దుకూడా నాకూ! పుస్తకాలట్రా నీ మొహానికీ? పదపద, ముచ్చు మొహం నువ్వూనూ. అసలెట్లా వెయ్యేకళ్ళతో కనిబెట్టుకు చస్తున్నా బతకలేకుండా వుంటేనూ!"

"మా జేజి నే సదువుకుంటే యిస్కోల్లో ఏపిత్తానందిగా. మా అయ్యే లేకుంటేనా"

"వూం వొచ్చి సస్తుంది మొహాలకు. ముసలి పీడా పెంటా పోగేసి కూడ పెడ్తున్నది గావాలూ? ఏ యిస్కోల్లోరా నీకు చదువు చెప్పేదీ?"

"మొదులు అయ్యే చెప్పకోనిత్తేగా, ఆ మద్దినేవోం ఎంకట్రత్తంగోరు అచ్చిరాలు సెబతా వుండాడూ—"

"ఎవరు ఆ మాలముతా ముండాకొడుకా! ఎవరు వాడేనా? అట్లా మిట కరించి చూస్తావేం గుడ్లు పొడిచేవాళ్లు లేకా. అసలు నీకు నేను చెప్పిందేమిటి నువు చేస్తున్నదేమిటీ? పొద్దూకులూ భోషాణం దగ్గిర చస్తావేం? అంట్లుచచ్చా? బర్రెను కడిగిచచ్చా? పిడికలుచచ్చా, చచ్చా?......"

ఆ రేత్తిరి బువ్వల్దిని పొండుకునేయాల, కొండాయి తడుపుకుంటూ సల్లగా వొచ్చి ఎంకట్రత్తయ్యే యింటి తలుపు తట్టాడు.

"ఎవరూ?" అంటా ఎంకట్రత్తవయ్య తలుపు దెరిశాడు.

"కొండాయిని."

"ఓరీ, నువ్వా! రా లోపలికి. ఇంత రాత్రొచ్చావేంరా?"

"ఏవిండోవ్—"

"అదేమిట్రా అక్కడే నుంచున్నావ్? దా, యిటొచ్చి చాపమీద కూచో."

"నీమిద్చి బంగారంగాను ఎప్పుడొచ్చావియ్యా, గుంటూర్నించీ? బలే ఆయనవియ్యాల నువు, అగపియకుండా బొయ్యావుగాన?"

"ఎవరు చెప్పార్రా నే నొచ్చాననీ?"

"అంతేనా ? మా జేజికి తెల్చిందంటా, సెప్పిందీ, ఆమయిన లగెత్తుకొచ్చా."

"యింతచీకట్లో వొచ్చావు, ఏం తెల్లవారి రాకపోయినా ? మీ జేజి అంతా బాగున్నారా ?"

"వుండారుగానీ – యిదిగో – నాకు సదువు సెప్పవంటయ్యా ?"

"ఏవిటా హడావుడీ !"

"అచ్చిరాలు సెబతావుంటివీ ఆమయిన యాడికో లగెత్తుకెల్తివి."

"అవును నిజమేరా. యీసారి అట్లా లగెత్తన్లే. చదువుకుంటావా ?"

"సనుకుంటావా ? యీపాలి అయిసా పయిసా తేలాల్చిందే."

"అయితే నీకు చదువు రావాల్సిందే."

"ఒయ్ నీమడ్చి దొంగల్దోలా ! యిన్నాలు ఎటనో బోయిందంటే పానం, యిగనేందీ !"

"కనకయ్యగారింటో జీతానికున్నావటగా ?"

"మాలచ్చుమ్మగారు కొట్టిందండీ యియ్యాలా."

"ఎందుకూ !"

"కాత్తెసాటుగా వుంటదనీ, బోసానంకాడ ఆల్లబ్బాయి పుత్తకంలో బొమ్మలు సూస్కుంటా కూకుంటేనీ, కొట్టిందండీ."

"అందుకా కొట్టిందీ ! మీ అయ్యతో చెప్పలా నువ్వూ ?"

"మరి సెప్పలా ? సెబుతేనీ, 'ఏడ్చావంటే యిరగబొడుత్తా' నన్నాడు. యీడ మోకాల్చిప్పమీనేసి కొట్టిందండీ. రఖతం కార్నట్టయితే వుండేది, ఏంవుండా !"

"రేపు మీ అయ్యను కనుక్కుంటానుండు. నే నిస్తాలే నీకు బొమ్మల పుస్తకాలు, నాదగ్గిరున్నయి."

"ఆఁ !"

"రోజూ చదువు చెపుతా చదువుకో."

"కాత్తె సెప్పవయ్యా నీయిల్లు బంగారంగానూ !"

"తరవాత మెల్లిగా గుంటూరు స్కూల్లో చేర్పించేస్తా."

"అదిగదీ, మా జేజి లెగిసాడుద్ది ! మరి అయ్య చంగతి ఎటనబ్బా, మాటకు ముంగల పొడుత్తా సంటాడూ ?"

"నే నున్నాలే."

"ఆఁ ! యిహి యిహి యిహి..." ఒక్కసారిగా కొండాయికి రెక్కలొచ్చి ఎగిరి కొండ సిగరాన వాల్నట్టయింది.

★